www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 నవంబర్ 2025
5
వైఎస్ఆర్



విఆర్ఎలతో రాత్రి పూట విధులు అన్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో విఆర్ఎలు పని చేస్తున్నారని, వారిని రాత్రిపూట కొన్ని తహశీల్దార్ కార్యాలయాలకు అనాథరైజేషన్‌గా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించమని ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదని విఆర్ఎ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటపతి, నాగేంద్ర, కోశాధికారి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 36 మండలాలున్నాయని, అన్ని గ్రామాల్లో, మండలాల్లో, పట్టణాల్లో, గ్రామ సేవకులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పని చేస్తున్న వీరికి తక్కువ వేతనాలు, ఎక్కువ శ్రమ రూపంలో ఉందని తెలిపారు. అర్హులైన వారందరికీ వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్ విఆర్ఓ, ప్రమోషన్లు ఇవ్వాలని పేర్కొన్నారు. కానీ ప్రమోషన్లు లేకుండా అనాథరైజేషన్‌గా వాచ్‌మెన్ లాగా పని చేయమని ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదని తెలిపారు. రాత్రి పూట వేస్తున్న విధులను రద్దు చేయాలని తెలిపారు.

పెరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి వ్యయం

పిఎసి చైర్మన్ కూన రవికుమార్



ఆర్‌టిపిపి ప్లాంట్‌ను సందర్శిస్తున్న పిఎసి చైర్మన్ కూన రవికుమార్, కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపిలో విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోందని ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పియుసి) చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. గురువారం పియుసి చైర్మన్ రవికుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ నగముసెయ్య, సభ్యులు బొమ్మిడి ఎమ్మెల్యే రంగారావు, తెనాలి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమార్‌రాజా, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆర్‌టిపిపి సందర్శించారు. అనంతరం డాక్టర్ ఎంవిఆర్ రాయలసీమ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఆర్‌టిపిపి) కాన్ఫరెన్స్ హాలులో పియుసి చైర్మన్ రవికుమార్ అధ్యక్షత సమీక్షా సమావేశం నిర్వహించారు. 1999లో 3400 ఎకరాల్లో ఏర్పాటైన ఆర్‌టిపిపి ప్రధానంగా వాణిజ్య, వ్యవసాయ అవసరాలకు సంతృప్త స్థాయిలో విద్యుత్ అవసరాలను పూరించే నిమిత్తం ఏపి జెన్‌కో సంస్థ నిర్వహణలో అత్యంత ప్రసిద్ధిగాంచిన విద్యుత్ ఉత్పత్తి సంస్థగా పేరు గాంచిందని కమిటీకి అధికారులు వివరించారు. ఆర్‌టిపిపిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం నాటి నుండి ఇప్పటివరకు నిర్వహణ, ఉత్పత్తి సామర్ధ్యం, సాంకేతిక పురోగతి, ఎదురైన సవాళ్లు, సమస్యల తదితర అన్ని అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటీ తెలుసుకుంది. ఆర్‌టిపిపిలో మ్యాన్ పవర్, కెపాసిటీ, ప్రస్తుతం పూరించిన ఉద్యోగాలు, ఖాళీ పోస్టుల వివరాలు, కాయిలర్ స్లైన్స్, ఏపి ప్రాతిపదికన నియామకాలు జరిగాయి, రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా జరిగిన జరిగిన నియామకాల వివరాలను అడిగి కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. సంస్థలో విధులు నిర్వర్తించే ఉన్నతాధికారులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఉద్యోగ ధర్మంతో పాటు, సామాజిక బాధ్యతను మరవకుండా సంస్థ పురోభివృద్ధి కోసం పాటుపడాలి తప్ప అలసత్వానికి తావివ్వకూడదని కమిటీ చైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో చాలా అధునాతనంగా నిర్మించారని తెలిపారు. ఇందులో బాయిలర్ చాలా పటిష్టంగా నిర్మించారన్నారు. ఆ స్థాయిలో బొగ్గు మనకు లభించడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని తాల్చెరువు కోల్‌మైన్స్ నుంచి, తెలంగాణలోని సింగరేణి కోల్‌మైన్స్ నుంచి బొగ్గు ఆర్‌టిపిపికి వస్తుందని తెలిపారు. ఈ బొగ్గు అనుకున్నంత నాణ్యతగా లేదని వివరించారు. విద్యుత్ ఉత్పత్తి ఖర్చు పెరుగుతోందని వివరించారు. ఈ నివేదికను అసెంబ్లీ ద్వారా ప్రభుత్వానికి ఇస్తామని అన్నారు. ప్రభుత్వం పరిశీలించి ఉత్పత్తి ఖర్చు తగ్గించే చేయడం నిర్ణయాలు తీసుకుంటుందని వివరించారు. ఆర్‌టిపిపిలో రెండు రకాల ఫ్లైయాష్ వస్తుందని తెలిపారు. ఒక రకం ఫ్లైయాష్ సిమెంట్ పరిశ్రమలకు, ఇటుకల పరిశ్రమలకు వెళుతోందని తెలిపారు. ఇంకో రకం యాష్ పాండ్‌లో 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ఫ్లైయాష్ నిల్వ ఉండిపోయిందని తెలిపారు. ఇది పరిశ్రమలకు తరలగాలని కేవలం గుంతలు పూడ్చేందుకు ఉపయోగ పడుతుందని వివరించారు. కొన్ని సందర్భాలలో ఇసుక బదులుగా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది అవసరం ఉన్నవారు ఉపయోగించుకుంటే బాగుంటుందన్నారు. అసెంబ్లీలో ఉన్న ఫైనాన్స్ కమిటీలో భాగంగా కమిటీ పబ్లిక్ అండ్ రిలేషన్స్ ఆధ్వర్యంలో మొదటిసారి ఆర్‌టిపిపి సందర్శించి చాలా నేర్చుకున్నామని తెలిపారు. జెన్‌కో కార్పొరేషన్‌లో ఉన్న యూనిట్లలో ఆర్‌టిపిపి ఒక ఇండివిజువల్ యూనిట్ అని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌టిపిపిలో 600 మెగావాట్ల యూనిట్‌ను, కోల్ ప్లాంటును, బాయిలర్లను పరిశీలించారు. మొదటగా మాజీ ముఖ్య మంత్రి ఎన్.టి.రామారావు ఆర్‌టిపిపిలో శంకు స్థాపన చేసిన చోటును పరిశీలించారు. అక్కడ క్లీన్ చేయించాలని నీట్‌గా ఉంచాలని అధికారులకు సూచించారు. సిఇ కార్యాలయంలో స్థానిక ఏపి జెన్‌కో అధికారులతో, స్థానిక సిబ్బందితో సమావేశం నిర్వహించి వారికి సూచ నలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆర్‌టిపిపి అధికా రులు కమిటీ చైర్మన్, సభ్యులకు దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టి పిపి డైరెక్టర్ పి.అశోక్ కుమార్‌రెడ్డి, సిఇ జి.ఎం.వాసుదేవరావు, ఎస్ఇ సోమశేఖర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఎస్.సిద్దయ్య, ఇఇ గురునాథ్, తహశీల్దార్ శోభన్‌బాబు, ఆర్‌టిపిపి సంబంధిత ప్లాంట్ల ఎస్ఇలు, డిఇలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్‌టిపిపి ఉద్యోగులు వారి సమస్యలను విన్నవిస్తూ వినతులను అందజే యగా అందుకు సంబంధించి వివరణ ఇవ్వాలని యాజ మాన్యానికి కమిటీ చైర్మన్ సూచించారు.

బూడిద కాలుష్యం నివారించాలి

ఆర్‌టిపిపి నుంచి సమీప గ్రామమైన కలమలకు బూడిద కాలుష్యం అధికంగా వస్తోందని, నివారించాలని సదరు గ్రామస్తులు అసెంబ్లీ కమిటీని కోరారు. ఉమ్మడివారంలో ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో అసెంబ్లీ కమిటీని వారు కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా కలమల గ్రామస్తులు ఎమ్మెల్యే రవికుమార్ వినతి పత్రం ఇచ్చారు. ఆర్‌టిపిపిలో 600 మెగావాట్ల ప్రాజెక్టు నుంచి మిల్ రిజెక్టెడ్ కోల్ ద్వారా బయటకు వస్తున్న గాలి కలమల వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఆ విషయం గాలి కలమల గ్రామం పైన పడుతోందని వారు తెలిపారు. కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామం లో ఎక్కడ చూసినా బూడిద ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇందుకు స్పం దిస్తూ అధికారులతో సంప్రదించి చర్యలు తీసు కుంటామని చెప్పారు. కార్యక్రమంలో కల్లమల్ల గ్రామస్తులు వెంకటేశు, మేకల శంకరయ్య, వేమయ్య గారి బాబు, పి నారాయణ, పరుశురాముడు, చంద్ర, రామాంజనేయులు, శివయ్య పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా పోలీసు సేవలు : డిఐజి



పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిఐజి కోయ ప్రవీణ్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ సేవలు విస్తరిస్తున్నామని కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం మైదుకూరు డిఎస్‌పి కార్యాలయంలో పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. మైదుకూరులోని అన్ని రహదారుల్లో అత్యాధునిక సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలపాటు కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది పర్యవేక్షణ చేపడతారని చెప్పారు. అత్యాధునిక సిసి కెమెరాల ద్వారా దొంగతనాలు, నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎస్‌పితో కలిసి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిసి ఫుటేజీలను పరిశీలించారు. కార్యక్రమంలో డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, సిఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సుబ్బారావు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎ.పి. రవీంద్ర, కరిస వేతనాలు కమిటీ రాష్ట్ర డైరెక్టర్ దాసరి బాబు, సీడీపిఎల్డుల సంస్థ రాష్ట్ర డైరెక్టర్ అన్నపరం సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు ధనపాల జగన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై

అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా

ప్రజాశక్తి - కడప అర్బన్

గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీస్ అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అత్యాధినక డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వన్‌టౌన్ సిఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహిస్తున్నారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో పాటు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు చేయిస్తూ నిందితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అనుమానిత ప్రాంతాల నుంచి పారిపోయిన నిందితులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి వారిని పట్టుకుని కౌన్సెలింగ్, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. గురువారం నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతంలోని గుర్రాలగడ్డ, పాత బస్టాండ్, నాగరాజుపేట, రాజా థియేటర్ పరిసరాలలో, పాత భవనాలు, ఇళ్ళు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు.



నగరంలో అనుమానిత ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తి పెంపు

- వయోజన విద్య ఏడీ వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వయోజన విద్య ఏడీ వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

పుస్తక పఠనం పిల్లల్లో జ్ఞాపక శక్తిని పెంచుతుందని వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎలిశెట్టి పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అక్షర జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. హెచ్ఎం మంజులవాణి మాట్లాడుతూ గ్రంథాలయ ఏర్పాటు కోసం ఉద్యమాలు చేసిన వారి సేవలను కొనియాడారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి రూథ్ ఆరోగ్య మేరీ మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయ వారోత్సవాలు, వేసవి శిక్షణ శిబిరాలు, విజ్ఞాన సదస్సులు దోహద పడతాయని పేర్కొన్నారు. ప్రపంచం తెలియాలంటే ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవదత్తం, షామీర్ బాష, ప్రతాపుడు, పుష్పరాజు, ఆనంద్ రాజు, గంగాధర్, గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ పి.రాజకుమార్, గ్రంథాలయాధికారి జి.రాజ్ కుమార్, సురేష్, నవాబు జాన్, జేమ్స్, సుబ్బమ్మ, రామ ప్రతాప్, శేఖర్, వెంకటరమణ, గౌస్, ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి. కార్యక్రమానికి స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ఇవి గాడిచర్ల హరిసరుత్తమరావు కృషి వల్లనే ఇప్పుడు గ్రంథాలయాలను ఉపయోగించుకుంటున్నామని చెప్పారు. గాడి చర్ల హరిసర్వోత్వరావు స్వాతంత్ర్య సమరయోధులు అని, అతి చిన్న వయసులోనే ఆయన స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని, గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రెడ్డన్న మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రజలను విజ్ఞాన వంతులను చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ జనార్ధన్, ఉపాధ్యాయులు నాగార్జున పాల్గొన్నారు.



పరీక్షలను తనిఖీ చేస్తున్న అధికారి

వైవీయూ డిగ్రీ పరీక్షల తనిఖీ

-ముగ్గురు విద్యార్థుల డిబార్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలను హైపర్ కమిటీ ఆకస్మికంగా తనిఖీ చేసింది. రెండు కేంద్రాలలో ముగ్గురు విద్యార్థులను డిబార్ చేశారు. విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు, హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య మాధవి, ఆచార్య రియాజున్నీసా సుండుపల్లెలోని వీరభద్ర డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబారు చేయగా, పుల్లారెడ్డిపేట ఎస్ఎల్ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరిని ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు డిబార్ చేశారు. ఈ సందర్భంగా సిఐ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో 55 పరీక్షా కేంద్రాలలో 16,887మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలకు అబ్జర్వర్లను పంపామని, హైపర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారన్నారు.

వైవీయూ ఎంబిఎ స్కాలర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం మాస్టర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ స్కాలర్ చాట్ల ఉమాదేవికి వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉమాదేవి ఆ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ పి.సరిత పర్యవేక్షణలో 'ఆర్థిక చేరికలో వాణిజ్య బ్యాంకుల పాత్ర: ఒక తులనాత్మక అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ విసి మార్గదర్శకం మేరకు నియమితులైన పర్యవేక్షుల బోర్డు, కమిటీ సిఫార్సుల ఆధారంగా ఉమా దేవి థీసిస్ డాక్టరేట్‌నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు స్కాలర్ ఉమాదేవికి పిహెచ్‌డి నోటిఫికేషన్‌ను ప్రకటించారు. ఈమె రాసిన రీసెర్చ్ పేపర్లు అంతర్జాతీయ జర్నల్స్ స్కోపస్, యూజీసీ కేర్ లిస్ట్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఉమాదేవిని అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు అభినందించారు.

ఎంబిఎ విద్యార్థుల ప్రతిభకు హెచ్ఒడి ప్రశంసలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతి సందర్భంగా అఖిలభారత విద్యార్థి సమాఖ్య స్త్రీ శక్తి దివస్‌లో కార్యక్రమం పేరుతో నిర్వహించిన వక్తృత్వ పోటీలో విజేతలను ఎంబిఎ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత అభినందించారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతి కింద విద్యార్థులు బంగారు పతకం, వెండి పతకం పొందడం ప్రశంసనీయమన్నారు. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం , నగదు బహుమతి అందుకున్న శ్రీవాణిని, ద్వితీయ స్థానాల్లో నిలిచి వెండి పతకం అందుకున్న బి.కావ్య, యు.తులసి ని డాక్టర్ సరిత అభినందించారు. ఇతర విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పోటీలో భాగస్వామ్యం కావాలని సూచించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ సరిత

ఘనంగా 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి- కడప అర్బన్



మాట్లాడుతున్న జయభారత్‌రెడ్డి

నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో ఉన్న కడప సహకార గృహ నిర్మాణ సంఘం కార్యాలయంలో గురువారం 72వ అఖిల భారత సహకార వారోత్స వాలు ఆ సంఘం అధ్యక్షుడు పి.జయభారత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి ఎం.వెంకటసుబ్బయ్య పాల్గొని సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి సహకార రంగం చేస్తున్న కృషి గురించి వివరించారు. కడప సహకార గృహ నిర్మాణ సంఘంఅధ్యక్షుడు జయభారత్ రెడ్డి మాట్లాడుతూ సంఘం ప్రస్తుత సంవత్సరం రూ.60 లక్షల లాభం అర్జించినదని తెలిపారు. కడప విభాగ సహకార శాఖ అధికారి గోపికృష్ణ భారతదేశంలో సహకార సంఘం చేస్తున్న సేవల గురించి వివరించారు. విశిష్ట అతిథిగా ఎం.వి శేషారెడ్డి సంఘ అభివృద్ధి పాటుపడిన విషయాలను తెలియజేశారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎం.బ్రహ్మానందరెడ్డి సంఘం అభివృద్ధి కోసం విశిష్ట సేవలు అందించిన వారి సేవలను కొనియాడారు. రుణాలను సక్రమంగా కట్టిన వారికి అతిథులచే మెమొంటోలను అందజేసి అభినందించారు. అనంతరం అతిథులకు సంఘం తరపున ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో సంఘం పాలకవర్గ సభ్యులు కార్యదర్శి భాను ప్రకాష్ రెడ్డి, ఎల్లారెడ్డి, సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, మురళీమోహన్, వేణుమాధవ్ రెడ్డి, ఇష్రత్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

న్యుమోనియాను తగ్గిద్దాం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుత చల్లటి వాతావరణంలో పిల్లలకు నిమోనియా వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకుని తగ్గించుకుందామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు అధ్యక్షతన పట్టణ, జిల్లా ప్రాథమిక ఆరోగ్య అధికారులకు సాన్స్ ప్రోగ్రాంపై ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి, 2026, ఫిబ్రవరి 28 వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. 'నిమోనియా లక్షణాలు త్వరగా గుర్తిస్తాం పిల్లల బాల్యాన్ని ఊపిరి పీల్చుకోనిద్దాం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఖలీఫ్ మాట్లాడుతూ పిల్లలలో నిమోనియా తీవ్రంగా ఉన్నప్పుడు యాంటీ బయోటిక్స్ మోతాదులో ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ఎయిడ్స్, లెప్రసీ డాక్టర్ రవిబాబు, వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, రమణమ్మ, మునిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కుమారి, ఫార్మసిస్ట్ సత్యవతి పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : 2026-27 ఏడాదికి సంబంధించి జిల్లాలో అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులు నూతన అక్రిడిటేషన్ల కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://mediarelations.ap.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని మొదటి దశలో పాత్రికేయులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా తమ పేరు, డెసిగ్నేషన్, ఇ మెయిల్ అడ్రస్, ఆధార్ నెంబరు,పాస్‌వర్డ్, ఫోన్ నెంబర్ నమోదు చేసి ఒటిపి ఎంటర్ చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. తదుపరి రెండవ దశలో పాత్రికేయులు ఫోన్ నెంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అప్లోడ్ చేసిన సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్‌లో పొందుపరిచి, జిరాక్స్ కాపీలను, దరఖాస్తు ప్రతిని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన ఇ మెయిల్ అడ్రస్, ఫోన్ నెంబరు, పాస్‌వర్డ్ తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-కాశినాయన : పోరుమామిళ్ల మండలంలోని శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్. క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ వి.రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో భాగంగా నిర్వహించిన అండర్ - 17 విభాగంలో డిస్కస్‌త్రోలో పాఠశాలకు చెందిన వెంకటేష్ ప్రథమ స్థానంలో సాయి నరసింహ, ద్వితీయ స్థానంలో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు తమ విద్యార్థి ఎంపిక అవ్వడం గర్వకారణమని చెప్పారు. విద్యార్థులు తరగతి గదిలో మాత్రమే కాకుండా క్రీడా రంగంలో కూడా తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు యాజమాన్యం ఎల్లప్పుడూ ఆకాంక్షిస్తూ ఉంటుందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణి, స్కూల్ ఇన్‌ఛార్జి కేశవరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడలలోనూ మరింత ఉత్సాహంతో తమ ప్రతిభ కనబరచాలని పేర్కొన్నారు.

నియామకం కోసం ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీ కళాశాల లలిత కళల విభాగంలో కూచిపూడి నృత్యంలో మహిళా బోధకురాలు నియామకం కోసం ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిప్లొమా ఇన్ కూచిపూడి డ్యాన్స్/ పి.జి. అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థుల బయో-డేటా, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీల సెట్‌తో నేరుగా వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలు విశ్వవిద్యాలయంలోని నూతన పరిపాలనా భవనంలో ఉన్న ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కోసం www.yvu.edu.inలో సందర్శించాలని తెలిపారు.

తేక్వాండోలో అలకనందకు బంగారు పతకం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తాడిపత్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలలో జిల్లాకు చెందిన ఎన్.అలకనందకు బంగారు పతకం లభించింది. ఈనెల 21, 22, 23 తేదీలలో ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తేక్వాండో సెక్రటరీ నాయిబ్ రసూల్ మాట్లాడుతూ 13 ఏళ్ల చిన్నారి కృషి, పట్టుదలతో బంగారు పతకం సాధిం చిందని పేర్కొన్నారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరులో నిర్వహించిన పోటీలలో పాల్గొని పతకాలు సాధించాలని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన అలకనందను గురువులు రుక్సానా, ఇర్ఫాన్‌ను అభినందించారు.



బంగారు పతకం సాధించిన అలకనంద



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

చంద్రబాబు జిల్లా పర్యటన వల్ల ఒరిగిందేమీ లేదు

- వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు జిల్లా పర్యటన వల్ల ఒరిగింది ఏమీ లేదని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్దిమంది వ్యక్తులను ఎంపిక చేసుకొని చంద్రబాబు నాయుడు సెల్ఫ్ డబ్బా కొట్టుకున్నారే తప్ప రైతులకు ఏమి చేయబోతున్నారో చెప్పలేదన్నారు. కడపలో మహానాడు నిర్వహించిన కడప జిల్లాకు ఒక్క పని చేసింది లేదన్నారు.15 రోజుల్లో ఉక్కు ఫ్యాక్టరీ పనులను ప్రారంభిస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పెట్టలేదు అన్నారు. మాటలు తప్ప చేతుల్లో చేసింది ఏమీ లేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం చేశామని వాపోయారు. వ్యవసాయం దండగా అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. అన్నీ తానే చేశానని, తన వల్లే సాధ్యం అయిందని చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇవిఎంల ద్వారా గెలవడం తప్ప డబల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి మేలు జరిగిందేమీ లేదన్నారు. పూటకో మాట మాట్లాడే ఆదినారాయణ రెడ్డిని ప్రజలు పట్టించుకోరు అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్. నాగార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షులు పులిసునీల్ కుమార్, యానాదయ్య, పాకా సురేష్, బీహెచ్ ఇలియాస్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అంగడి వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈడిగ మోక్షజ్ఞ గౌడ్ ఎంపికయ్యాడని పధానోపాధ్యాయులు పెనుబాల సుజాత తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కడపలోని డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించిన అండర్ -14 క్రికెట్ జిల్లాస్థాయిలో ఎంపికలో పాల్గొని రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడని ఆమె తెలిపారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో మోక్షజ్ఞ గౌడ్ పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం ఆ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు చింత గింజల సుదర్శన్ బాబు క్రీడల్లో ఇంకా మంచిగా రాణించాలని నగదు ప్రోత్సాహ బహుమతినిప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా అందజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అగ్గిరప్ప అభినందనలు తెలియజేశారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ సాయి చరితరెడ్డి

కుష్టు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కుష్టు వ్యాధి ఇతరులకు సోకకుండా బాధితులు జాగ్రత్తలు తీసుకోవాలని చిలమకూరు వైద్యాధికారి డాక్టర్ సాయి చరితరెడ్డి తెలిపారు. కుష్టు వ్యాధి బాధితులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం స్థానికులకు ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉంటాయన్నారు, చేతుల నుంచి వస్తువులు జారి పోవడం, కనుబొమ్మలు, కనువెంట్రుకలు రాలిపోవడం జరుగుతుందన్నారు. మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, కాళ్లకు చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధిగ్రస్తుడు తుమ్మడం ద్వారా బ్యాక్టీరియా వలన వ్యాధి ఇతరులకు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగమునిరెడ్డి, హెచ్ఎం పద్మనాభయ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి పార్వతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రవిశంఖరరెడ్డి, ఉపాధ్యాయులు హరికృష్ణ, గంగా భవాని, శోభారాణి పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు మాటల్లో వాస్తవం లేదు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

సూపర్‌సిక్స్ హామీలు సూపర్‌హిట్ అయ్యాయని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటల్లో వాస్తవం లేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు, రైతులకు పచ్చి అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రధానమైన 3 హామీలు ఇంతవరకు అమలుకే నోచుకోలేదన్నారు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని విమర్శించారు. ఒక్కో నిరుద్యోగికి రూ.51 వేలు కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులను నమ్మించి మోసగించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని అమలు చేయలేదన్నారు. కూటమి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మాటలు తగ్గించి చేతల్లో రైతులకు, ఆయా వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

చాపాడు : రాయలసీమ రైతులను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెండ్లిమర్రి మండలంలో బుధవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో రైతులను పూర్తిగా నిరాశకులోను చేశారన్నారు. మొదటి ఏడాది పూర్తిగా పక్కన పెట్టారన్నారు. రైతులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఉల్లి నష్టపరిహారం ఊసే లేదన్నారు. పంటల బీమా రూ.173 కోట్లు అనుకున్నా కనీసం లేదన్నారు. రాయలసీమకు సాగు నీరు తీసుకొచ్చానని చెప్పుకుంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు.

నేడు సుస్థిర అభివృద్ధి లక్ష్యంపై శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)


పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామ పంచాయతీ అనే అంశంపై మైదుకూరు మండలంలోని గీన్ అంబాసిడర్లకు, గ్రీన్ గార్డ్‌లకు గంజికుంటలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని 7 గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామ ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రీన్ అంబాసిడర్ పాల్గొనాలని తెలిపారు. **చాపాడులో..** చాపాడు మండల కేంద్రంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏఓ రామానుజం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

వేముల : వేములలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్లినిక్ విలేజ్ అనే కార్యక్రమం కింద వేముల గ్రామాన్ని ఎంపిక చేశారని ఎంపిడిఓ గంగాదేవి తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 6 గంటల నుంచి 9:30 గంటల వరకు నిర్వహించున్నట్లు తెలిపారు. గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ కోరారు.

జగన్‌ను కలిసిన హృషికేశవరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా



మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంబాయి హృషికేశవరెడ్డి గురువారం బెంగళూరులో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో కోటి సంతకాల సేకరణపై చర్చించామన్నారు. కోటి సంతకాల సేకరణలో ప్రజల స్పందన బాగుందని తెలిపామన్నారు. మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయడం వల్ల పేదలకు ఉచిత వైద్యం భవిష్యత్‌లో అందే పరిస్థితి లేదని ప్రజలతో చర్చించామన్నారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జీవితంపై విరక్తితో షేక్ పర్వీన్ (37) అనే మహిళ ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పులివెందులకు చెందిన పర్వీన్‌కు టిప్పు సుల్తాన్ అనే వ్యక్తితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరు హైదరాబాదులో కాపురం ఉంటున్నారు. పర్వీన్ సాఫ్ట్వేర్ ఇంజినీరుగా విధులు నిర్వహించేది. పర్వీన్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేది. తన భర్త టిప్పు సుల్తాన్‌తో మనస్పర్థలతో రెండు రోజుల క్రితం జేఎన్టీయూలో విధులు నిర్వహిస్తూ, కళాశాల క్వార్టర్స్‌లో ఉన్న తన సోదరి తాజ్ ఇంటికి వచ్చింది. ఓవైపు ఆరోగ్య సమస్యలు, మరో వైపు భర్తతో మనస్పర్థలు ఉండడంతో జీవితంపై విరక్తి కలిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందింది. విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన తన సోదరి ఎంతసేపటికి తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల ఉన్న వాళ్ల సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా పర్వీన్ అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనాస్థలాన్ని సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ సుబహాన్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన పర్వీన్

పడకేసిన పారిశుధ్యం.. పందుల స్వైరవిహారం



రామిరెడ్డి పల్లె మోటు సమీపంలో చెత్తకుండి వద్ద పందులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగులో పారిశుధ్య పనులు పూర్తిగా పడకేశాయి. తాడిపత్రి రోడ్డులో రామిరెడ్డి పల్లె మోటు సమీపంలో చెత్తకుండి వద్ద పందులు స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప హోటల్ యజమాన్యం వ్యర్థాలను అక్కడ వేయడంతో పందులు తీవ్రత ఎక్కువైందన్నారు. పట్టణంలో దోమలు కూడా అధికంగా ఉన్నాయని, రోగాల బారిన పడుతున్నట్లు వాపోయారు. మున్సిపాలిటీ అధికారులు దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెత్తకుండీల వద్ద ఉన్న చెత్తను ప్రతిరోజూ ఎత్తేయాలని, పందుల సంచారాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపికతో ఉన్నామని రెచ్చగొట్టడం సరికాదు : వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఓపికతో ఉన్నామని రెచ్చగొట్టడం సరి కాదని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని ఉద్దేశించి పులివెందుల వైసిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్ కుటుంబంపై ఆది నారాయణ రెడ్డి మీడియా ముఖంగా విమర్శించే అర్హత లేదన్నారు. దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెట్టిన భిక్ష ఈ రోజు ఎమ్మెల్యేగా ఉండడానికి కారణమన్నారు. ఊసరవెల్లిలా పార్టీ రంగులు మార్చే మీరు మాట్లాడడం సరికాదన్నారు. భారతదేశాన్ని నాశనం చేస్తున్న ఘనత బిజెపిదేనని విమర్శించారు. మోసాలు చేసి ఎన్నికల్లో ఎలా గెలిచారో ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. త్వరలో ప్రజలు తిరగబడే రోజులు దగ్గర ఉన్నాయని తెలిపారు. రాజద్రోహం కింద జైలుకు పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మాట్లాడే ముందు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైసిపి పట్టణ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, నాయకులు హేమాద్రి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని నిరంతరం కొనసాగించాలి



మైదుకూరులో.. బహుమతులతు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చాపాడు

పుస్తక పఠనాన్ని విద్యార్థులు నిరంతరం కొనసాగించాలని ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ తెలిపారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. తీరిక సమయాల్లో క్రమం తప్పకుండా వెళ్లి చదవాలన్నారు. విద్యార్థుల మేధస్సు పెంపొందించుకొనుట, దినపత్రికలు చదువుట ద్వారా విద్యార్థులు మంచి విషయాలు తెలుసుకోవచ్చన్నారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బిడిసి రవిశంకర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **మైదుకూరులో..** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ముగింపు కార్యక్రమం మైదుకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాభవాని మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువైన సమయాన్ని సెల్‌ఫోన్, టీవీలకు వెచ్చించి మీ జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. దగ్గర్లో ఉన్న గ్రంథాలయాలకి వెళ్లి మంచి మంచి పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం, ఆనందం, ఆరోగ్యం పొందవచ్చన్నారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాముడు, గ్రంథాలయ నిర్వాహకుడు మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్దనూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రంథాలయం అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్, డ్రాయింగ్, పద్యాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : గ్రంథాలయ శాఖ పితామహుడు ఎస్ఆర్ రంగరాజన్ జయంతిని పురస్కరించుకొని జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. స్థానిక వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయాల శాఖ, పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో వారం రోజులుపాటు ఈ ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా, వక్తృత్వ పోటీలను పెట్టారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ నాగేంద్ర, ప్రభుత్వ గ్రంథాలయంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి పి. మాధవరావు, ప్రభుత్వ గ్రంథాలయ అధికారి వనజాకుమారి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, అధ్యాపకులు బాలకొండ గంగాధర్, నాగలక్ష్మి దేవి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఓబుల్ రెడ్డి, రేష్మా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : గ్రంథాలయానికి వస్తే క్రమశిక్షణ అలవడుతుందని వక్తలు తెలిపారు. స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ ఎస్‌టిఓ తిరుపతి స్వామి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చదువుల బాబు, అనిబిసెంట్ మున్సిపల్ పాఠశాల హెచ్ఎం ఆర్.గీత, సామాజిక రచయితలు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, తాళమాపురం రిటైర్డ్ హెచ్ఎం గోపీనాథ్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ చాడా మునిశేఖర్ రెడ్డి, జెవివి కన్వీనర్ చంద్రశేఖర రావు పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బంది ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారిని టి.తిరుపతమ్మ గ్రంథాలయ హెల్పర్ నాగలక్ష్మిదేవి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చక్రాయపేట : గ్రంథాలయం వెళ్లి పలు రకాల పత్రికలతోపాటు పుస్తకాలను చదివితే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని గండి క్షేత్రం సభ్యుడు కె.రామచంద్రారెడ్డి సూచించారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా అధికారి ఏ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, బి.డి.సి.నిర్వాహకులు పి.శివప్రసాద్ రెడ్డి, బి.డి.సి.నిర్వాహకులు, ఎం.రామసుబ్బయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, జనార్ధన్ పాల్గొన్నారు.

వేముల : వేముల గ్రంథాలయ శాఖలో వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారం రోజులపాటు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాదాపీర్, మహేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి విచ్చేశారు. గ్రంథాలయ అధికారి నారుబోయిన గంగాధర్ యాదవ్, జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు మహేశ్వర్‌రెడ్డి, పాఠకులు వలి, ఆటో షామీర్, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.




చెక్కులను పంపిణీ చేస్తున్న భూపేష్‌రెడ్డి

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి బాధితులకు పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన 60 మంది లబ్ధిదారులకు రూ.21,19,232 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే నష్టపోయిన కార్యకర్తలకు చేయుతగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటుందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, స్టేట్ లీగల్ సెల్ కార్యదర్శి సూర్య పెద్దిరాజు, పాపిరెడ్డి, కొండయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న సహకార బ్యాంకు డిఆర్ సత్యానంద్

ఫిర్యాదు మేరకు సొసైటీ రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని చింతల మడుగుపల్లె సహకార సొసైటీలో రుణాలకు సంబంధించిన రికార్డులను గురువారం సహకార సొసైటీ బ్యాంకు అధికారులు తనిఖీలు చేపట్టారు. రైతులకు క్రాపు, మార్టీ గ్రేజ్ రుణా లతోపాటు ఇతర రుణాలను ఇచ్చిన వాటికి సహకార సొసైటీలో ఇస్తున్న రుణాలపై వేంపల్లె మండలానికి చెందిన కొందరు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు డిసిసి బ్యాంకు జిల్లా రిజిస్ట్రార్ సత్యానంద్, పులివెందుల ఎడిఆర్ కమాలాదేవి ఆయా రికార్డులను తనిఖీ చేశారు. ఫిర్యాదు నేపథ్యంలో రైతులతో అధికారులు చర్చించారు. రికార్డులను తనిఖీ చేసి జిల్లా అధికారులకు నివేదికలు పంపిస్తామని ఎడిఆర్ కమాలాదేవి చెప్పారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు హుండీల కానుకలను లెక్కిస్తున్నామని, ఇందులో ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని ఇఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కడప దేవాదాయశాఖ అధికారి, మండల రెవెన్యూ అధికారి, ఆర్యేవ్యాలీ పోలీసులు, ఆలయ ధర్మకర్త మండలి వారి సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు.



విద్యార్థులకు నేరాలపై అవగాహన కలిగిస్తున్న సిఐ

చదువుపై దృష్టి సారించాలి : అర్బన్ సిఐ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అర్బన్ సిఐ సీతారామిరెడ్డి సూచించారు. స్థానిక జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు సెల్‌ఫోన్ వాడకం, సైబర్ నేరాలు, గుడ్ బ్యాడ్ టచ్, ఇన్‌స్టాగ్రామ్‌పై కలిగే నష్టాలను ఆయన వివ రించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. అపరిచితులు మొబైల్ ఫోన్లకు లింకులు పంపుతారని, వాటిని ఓపెన్ చేస్తే ఖాతాలోని డబ్బును మాయం చేస్తారన్నారు. తెలియని వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని వివరించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందన్నారు. సెల్‌ఫోన్ పక్కన పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాటర్ గ్రిడ్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ చిన్నయ్య

వాటర్ గ్రిడ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వేముల

పులివెందుల నియోజకవర్గంలో ప్రజల దాహన్ని తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని మేఘా కంపెనీ ప్రతినిధులకు ఆర్‌డిఒ చిన్నయ్య సూచించారు. మండలంలోని వేల్పుల-వేముల ప్రధాని రహదారి మధ్యలో జరుగుతున్న మెగా వాటర్ గ్రిడ్ పనులను గురువారం ఆయన డిప్యూటీ తహశీల్దార్ జగదీష్ బాబుతో కలిసి పరిశీలించారు. కంపెనీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తిచేసి నియోజకవర్గం అంతా తాగు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రామచంద్రయ్య, మెగా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

బ్యాడ్మింటన్‌లో వేదవ్యాస విద్యార్థికి రజతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప వైవియూ ఆధ్వర్యంలో ఈ నెల 19న బద్వేలు బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కాలేజిలో జరిగిన అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీలో శ్రీవేదవ్యాస డిగ్రీ కళాశాల తొలి సంవత్సరం విద్యార్థి పి.భరత్ రాజేష్ రెండో బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ ఎల్.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన విద్యార్థిని అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ విజేతగా నిలిచిన భరత్ రాజేష్‌కు రజత పతకం, సర్టిఫికేట్, రూ.500 నగదు బహుమతి వచ్చిందన్నారు. భరత్ రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను అభినందిస్తూ కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ కె.నాగరాజ, వి.రామలక్ష్మిరెడ్డి, ఎస్.పి.యాసిన్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి

వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సత్యసాయి సేవా సమితి వేంపల్లి శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలిపారు. మండలస్థాయి వ్యాసరచన పోటీల్లో మహమ్మద్ ఇంతియాజ్, వెంకట ఉష, వెంకట లోహిత ప్రతిభ కనపరిచినట్లు చెప్పారు. పాఠశాల స్థాయిలో గీతిక, హర్షిత, కౌశిక, దివిజా, నీరజ్ కుమార్ రెడ్డి ప్రతిభ కనపరిచినట్లు చెప్పారు. విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసపత్రాలను, జ్ఞాపికలను అందజేశారన్నారు. విద్యార్థులను గురువారం పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి అభినందించారు. ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణ కుటుంబాల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణ కుటుంబాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయడమే బ్రాహ్మణ చైతన్య వేదిక లక్ష్యమని ఆ వేదిక నాయకులు ప్రసాదరావు, సూగురు రఘునాథరావు తెలిపారు. గురువారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత జరిగిన ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం బ్రహ్మణులు కృషి చేశార న్నారు. 2014 నుండి బ్రాహ్మణ చైతన్య వేదిక టిడిపి గెలుపు కోసం పని చేస్తు_న్నట్లు చెప్పారు. బ్రహ్మణ చైతన్య వేదిక ఏర్పాటు చేసి నేటికి 12ఏళ్లయిందన్నారు. 2014 డిసెంబర్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును సీనియర్ నాయకులు నాగబాబు, శ్రీధర్ కార్పొరేషన్ ఏర్పాటుకు వినతిపత్రం ఇవ్వడంతో చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. కార్పొరేషన్ ప్రాధాన్యతపై రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసి, కార్పొరేషన్‌ను సద్వినియోగం చెసుకొనే విషయమై అవగాహన కల్పించినట్లు చెప్పారు.